సాక్షి
అన్నమయ్య జిల్లా
బుధవారం : 20 : ఆగస్టు : 2025


ఆత్మీయం.. ఆనందం

న్యూస్‌రీల్

రేపు మెగా జాబ్‌మేళా

రాజంపేట టౌన్: రాజంపేట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.పురుషోత్తం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఈ జాబ్‌మేళా జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. పదో తరగతి నుంచి డిగ్రీ పాస్ లేక ఫెయిల్ అయిన వారు, సాంకేతిక విద్య అభ్యసించిన వారు అర్హులన్నారు. http://naipunyam.ap.gov.in user registration లింకు ద్వారా పేర్లను నమోదు చేసుకోవాలని వివరించారు.

పెన్షన్ రద్దయిన వారు అప్పీల్ చేసుకోండి

రాయచోటి టౌన్: జిల్లా వ్యాప్తంగా అనర్హత ఉన్నట్లు ప్రభుత్వం నుంచి నోటీసు అందుకున్న వారు.. అర్హత ఉన్నట్లుగా మీరు భావిస్తే అందుకు సంబంధించిన అర్హత పత్రాలతో అప్పీల్ అర్జీ చేసుకోవాలని వైద్యశాఖ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీడీవోకు గానీ, మున్సిపల్ కమిషనర్‌కు గానీ అర్జీ రాసుకోవాలని వారు పేర్కొన్నారు. పాత, కొత్త సదరం సర్టిఫికెట్లు, ఎక్కడైనా చికిత్స పొందినట్లు రికార్డులు ఉన్నా సమర్పించాలన్నారు. వీటిని వారి కంప్యూటర్‌లో పొందుపరచి తిరిగి నోటీసులు పంపుతారని తెలిపారు. వారు కేటాయించిన రోజున వైద్యుల దగ్గర పరీక్షలకు హాజరు కావాల్సి ఉంటుందని తెలిపారు. హాజరు అయ్యే విషయం, తేదీలు నోటీస్ ద్వారా తెలియజేస్తారని వివరించారు.

వికసించిన బ్రహ్మకమలం



రాయచోటి జగదాంబసెంటర్: రాయచోటి పట్టణం పాతరాయచోటిలో నివసిస్తున్న మున్సిపల్ ఉద్యోగి మల్లికార్జున ఇంట్లో బ్రహ్మకమలం వికసించింది. శీతల ప్రాంతాల్లో కనిపించే అరుదైన ఈ పుష్పం వికసించడంతో పలువురు వీక్షించేందుకు వస్తున్నారు. శివుడికి ప్రీతిపాత్రమైన పుష్పంగా పురాణాలు చెబుతున్నాయని, ఏడాదిలో ఒక సారి మాత్రమే అది కూడా రాత్రి వేళలోనే ఈ పువ్వు పూస్తుందని మల్లికార్జున తెలియజేశారు. రాత్రివేళలో శ్వేత వర్ణంలో పెద్దగా వికసించే ఈ పూలు ఉదయానికి మొగ్గలా ముడుచుకుంటాయన్నారు. ఈ పుష్పాన్ని దేవుని పూజకు వినియోగిస్తామని ఆయన తెలియజేశారు.

28న లాటరీ ద్వారా బార్ల కేటాయింపు

రాయచోటి: నూతన బార్ పాలసీలో భాగంగా జిల్లాలోని బార్లను ఈ నెల 28న లాటరీ ద్వారా కేటాయించనున్నట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఎం.జయరాజ్ తెలిపారు. మంగళవారం అన్నమయ్య జిల్లా ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ జి.మధుసూదన్ అధ్యక్షతన జిల్లా పరిధిలోని ఎక్సైజ్ సీఐలు, లైసెన్సీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లి-5, రాజంపేట-2, రాయచోటి-3, పీలేరు-1 బార్లకు నోటిఫికేషన్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ నెల 26లోపు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. దరఖాస్తులను 28న జిల్లా కలెక్టర్ శ్రీధర్ చేతుల మీదుగా లాటరీ పద్ధతిలో తీసి, బార్ల కేటాయింపు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జోగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టం.. వజ్రాయుధం


ర్యాలీ నిర్వహిస్తున్న సహకార శాఖ అధికారులు, సిబ్బంది

రాజంపేట: సమాచారం హక్కు చట్టం ప్రజలకు వజ్రాయుధమని జిల్లా సహకార శాఖ అధికారి గురుప్రకాశ్ తెలిపారు. రాజంపేటలో డీసీఓ ఆధ్వర్యంలో మంగళవారం సమాచారహక్కు చట్టంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2005 నుంచి సమాచారం హక్కు చట్ట కొనసాగుతోందన్నారు. ఈ చట్టంపై ప్రజల్లో సరైన అవగాహన లేకుండా పోతోందన్నారు. పౌరులు తమ హక్కులను వినియోగించుకోలేక పోతున్నారన్నారు. అందువల్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించామన్నారు. అర్జీదారికి సరైన సమాచారం ఇవ్వడం ప్రభుత్వ సిబ్బంది బాధ్యత అన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ గోపికృష్ణ, కేజీవీ నాయుడు, ఎస్ఐ ఎస్వీ రమణ, డీసీసీబీ మేనేజరు రాజేష్, పీఏసీఎస్ సీఈవోలు, డీసీసీబీ సిబ్బంది, సహకార శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఉప్పొంగిన అభిమానం


రాజంపేట పరిధిలో అభిమానులకు అభివాదం చేస్తున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

- వైఎస్ జగన్ రాకతో సందడే సందడి
- అడుగడుగునా జన నీరాజనం
- హెలీప్యాడ్ వద్ద కిక్కిరిసిన అభిమానులు
- 'ఆకేపాటి' వారి రిసెప్షన్‌కు హాజరైన జననేత
- నూతన వధూవరులకు ఆశీర్వాదం
- హోరెత్తిన జగన్నినాదాలు

సాక్షి రాయచోటి: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజల్లో అభిమానం ఉప్పొంగింది. ఆయన రాకతో అన్నమయ్య జిల్లాలో సందడి వాతావరణం నెలకొంది. రాజంపేట పరిధిలోని ఆకేపాటి ఎస్టేట్‌లో పండుగ వాతావరణం కనిపించింది. ఎస్టేట్‌లోని ఆకేపాటి స్వగృహం వద్ద ఏర్పాటు చేసిన వివాహ రిసెప్షన్ కార్యక్రమానికి పార్టీ నేతలతో పాటు కార్యకర్తలు, అభిమానులు, ఆకేపాటి కుటుంబీకులు, బంధవులతో ఆ ప్రాంతం కళకళలాడింది. మాజీ సీఎం హెలీప్యాడ్‌లో అడుగు పెట్టినప్పటి నుంచి.. తిరుగు ప్రయాణం అయ్యే వరకు చుట్టూ ఎక్కడ చూసినా జగనిన్నాదాలతో హోరెత్తింది. మరోపక్క యువత, పార్టీ శ్రేణులు సీఎం.. సీఎం.. అంటూ నినదించారు. ఇసుకేస్తే రాలనంత జనంతో కిక్కిరిసిపోయింది.

నూతన వధూవరులకు ఆశీర్వాదం

అన్నమయ్య జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి సోదరుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి, సుజనల కుమారుడు ఆకేపాటి అనురాగ్ రెడ్డి, వరదీక్షితరెడ్డిలను మంగళవారం రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీర్వదించారు. ఆకేపాటి ఎస్టేట్‌లోని స్వగృహం వద్ద ఏర్పాటు చేసిన రిసెప్షన్ కార్యక్రమానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆకేపాటి అమర్‌నాథరెడ్డి సతీమణి అమరజ్యోతమ్మ, అనిల్‌కుమార్‌రెడ్డి కుటుంబ సభ్యులను వైఎస్ జగన్‌కు పరిచయం చేశారు. అనంతరం వారితో కాసేపు ముచ్చటించారు.

ఘన స్వాగతం

మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి హెలీప్యాడ్‌లో వైఎస్సార్ సీపీ నేతలు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డితోపాటు ఇతర నాయకులు సాదర స్వాగతం పలికారు. కొంత మంది నాయకులు పుష్పగుచ్ఛాలు అందించి అధినేతకు ఆహ్వానం పలికారు. అనంతరం హెలీప్యాడ్ నుంచి నేరుగా రిసెప్షన్‌కు మాజీ సీఎం పయనమయ్యారు. అడుగడుగునా వైఎస్ జగన్‌కు జనాలు బ్రహ్మరథం పడుతూ ఘన స్వాగతం పలికారు. కార్యక్రమానంతరం వైఎస్ జగన్ బెంగళూరుకు తిరుగు పయనమయ్యారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన రాజంపేట పరిధిలో విజయవంతంగా ముగియడంతో పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది.

జనమే జనం

రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం ఉదయం 11.25 గంటల ప్రాంతంలో బాలిరెడ్డిపల్లె సమీపంలోని హెలీప్యాడ్‌లో దిగిన దగ్గరి నుంచి.. ఆకేపాటి ఎస్టేట్ వరకు ఎక్కడ చూసినా జనమే కనిపించారు. కడప-రేణిగుంట ప్రధాన రహదారిలోని ఆకేపాటి ఎస్టేట్‌కు వెళ్లే దారి అంతా కూడా వాహనాలతోనే కనిపించింది. హెలీప్యాడ్ చుట్టూ పార్టీ శ్రేణులు, కార్యకర్తలు జెండాలు చేతబూని జగన్.. జగన్ అంటూ నినాదాలతో హోరెత్తించారు. మరోపక్క సీఎం.. సీఎం.. అంటూ కూడా కేరింతలు కొట్టారు. హెలీప్యాడ్‌తోపాటు చుట్టూ మిద్దెల మీద నిలుచొని జగన్‌ను తిలకించారు. హెలీప్యాడ్ నుంచి ఆకేపాటి ఎస్టేట్ వరకు సుమారు కిలోమీటరుకు పైగా రోడ్డు వెంట ఎక్కడ చూసినా జనమే కనిపించారు. ఎస్టేట్‌లో అయితే జన నీరాజనం కనిపించింది.

పార్టీ నేతలతో కాసేపు..

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ నేతలతో కాసేపు మాట్లాడారు. హెలీప్యాడ్ వద్ద చాలా మంది నాయకులు కలిసి చర్చించారు. తర్వాత ఆకేపాటి కుటుంబీకుల రిసెప్షన్ కార్యక్రమం వద్ద కూడా కొంత మంది నాయకులు, కార్యకర్తలు కలిసి మాట్లాడారు. ప్రధానంగా మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌ఎండీ అంజద్‌బాషా, మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్, వైఎస్సార్ సీపీ వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల అధ్యక్షులు పోచంరెడ్డి రవీంద్రనాథరెడ్డి, ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, కడప మేయర్ కొత్తమద్ది సురేష్‌బాబు, ఎమ్మెల్యే దాసరి సుధమ్మ, మాజీ ఎమ్మెల్యేలు శెట్టిపల్లి రఘురామిరెడ్డి, రాచమల్లు ప్రసాద్‌రెడ్డి, చింతల రామచంద్రారెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, ఎమ్మెల్సీలు పొన్నపు రామసుబ్బారెడ్డి, రామచంద్రారెడ్డి, పార్టీ పరిశీలకులు ఎస్.అనిషారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ ఎస్వీ సతీష్‌కుమార్ రెడ్డి, జిల్లా పరిషత్ అధ్యక్షులు ముత్యాల రామగోవిందరెడ్డి, మదనపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జి నిసార్ అహ్మద్, అనంతపురం పార్టీ నేత వెన్నపూస రవీంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దేశాయి తిప్పారెడ్డి, జిల్లా పరిషత్ మాజీ అధ్యక్షులు సుగువాసి బాలసుబ్రమణ్యం, మాజీ ఉపాధ్యక్షులు ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, రైతు సంఘం నాయకుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, సోషల్ వెల్ఫేర్ బోర్డు మాజీ చైర్మన్ పులి సునీల్ కుమార్, బీసీ నాయకుడు శిబ్యాల విజయభాస్కర్, డీసీసీబీ మాజీ చైర్మన్ ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, ఏబీటీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు బొప్పా గంగిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్ జిల్లా మున్సిపల్ విభాగం అధ్యక్షులు వల్లంబాయి రిషికేశ్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఏకుల రాజేశ్వరి, వైఎస్సార్ సీపీ రైల్వే కోడూరు నాయకులు ధ్వజారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్ సీపీ గల్ఫ్ కన్వీనర్ బీహెచ్ ఇలియాస్, సురేఖారెడ్డి తదితరులు పార్టీ అధినేతను కలిసి మాట్లాడారు.

ఇసుకేస్తే రాలనంత జనంతో ఎటువైపు చూసినా పార్టీ శ్రేణులు, ఆకేపాటి బంధువులు, స్నేహితులతో ఆ ప్రాంతమంతా రద్దీగా మారింది. వైఎస్ జగన్‌పై పూలవర్షం కురిపిస్తుండగా.. ఆయన అలా ముందుకు కదిలారు.





ఉరకలేసిన ఉత్సాహం


జననేత కోసం రోడ్డు వెంట భారీగా ఉన్న అభిమానులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

నిబంధనలకు తూట్లు.. రైతులకు పాట్లు

- మార్కెట్ కమిటీ పాలకవర్గం ఆదేశాలను పట్టించుకోని వ్యాపారులు
- టమాట ధరల్లో కోతలు
- కర్షకుడికి తప్పని ఇబ్బందులు




వేలం పాటల సమయంలో టమాటా క్రేట్లపై అదనంగా ఎత్తుగా పోసిన టామాటాలు

గుర్రంకొండ: జిల్లాలోని వాల్మీకిపురం, గుర్రంకొండ, కలికిరి, కలకడ, పీలేరుల్లో మార్కెట్ యార్డులు ఉన్నాయి.వీటిల్లో ప్రభుత్వ నిబంధనలు అమలు కాక పోవడంతో రైతులు నష్టపోతున్నారు. వాల్మీకీపురం కొత్త మార్కెట్‌కమిటీ పాలకవర్గం ప్రమాణస్వీకారం అనంతరం జూన్‌నెల 16న గుర్రంకొండ మార్కెట్‌యార్డు ఉపకార్యాలయంలో పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రైతుల సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. వ్యాపారులను పిలిపించి పాలకవర్గం సమావేశంలో తీసుకున్న నిబంధనలను అన్ని మండీలలో వ్యాపారులు అమలు చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం మండీల్లో అమలు చేస్తున్న 30 కేజీల క్రేట్ల స్థానంలో 15 కిలలో టమాటా క్రేట్లు ఏర్పాటు చేయాలి. జాక్‌పాట్ విధానం ప్రభుత్వ నిబంధనలకు పూర్తిగా విరుద్ధమని, తక్షణం దానిని రద్దు చేయాలన్నారు. ఇకపై వంద క్రేట్లకు 10 టమాటా క్రేట్లు జాక్‌పాట్ పేరుతో రైతుల వద్ద నుంచి తీసుకోకూడదన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు నాలుగుశాతం కమిషన్ మాత్రమే రైతుల వద్ద నుంచి వసూలు చేసుకోవాలని, పదిశాతం కమీషన్ తీసుకోకూడదని హెచ్చరించింది. అయినా కొత్తపాలకవర్గం విధానాలు ఒక్కటి కూడా మార్కెట్ యార్డుల్లో అమలుకు నోచుకోక పోవడం గమనార్హం

జాక్‌పాట్ పేరుతో నిలువుదోపిడీ

రెండునెలల క్రితం జాక్‌పాట్‌లు రద్దు చేయాలని మార్కెట్ కమిటీపాలక వర్గం ఆదేశాలు జారీ చేసింది. అయినా రైతులను వ్యాపారులు నిలువుదోపిడీ చేస్తున్నారు. పడమటి మండలాల్లో మదనపల్లె తర్వాత గుర్రంకొండ మార్కెట్‌యార్డు అతిపెద్దది. ప్రతినిత్యం 40 నుంచి 50 లారీలోడ్ల టమాటాలు ఇక్కడికి వస్తుంటాయి. సుమారు 30 టమాటా మండీలు నిర్వహిస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వ్యాపారులు ఇక్కడి వచ్చి టమాటాలు కొనుగోలు చేస్తుంటారు. అయితే స్థానిక వ్యాపారులు జాక్ పాట్ పేరుతో రైతులను దగా చేస్తున్నారు. జాక్ పాట్ ఉండకూడదనేది ప్రభుత్వ నిబంధన. అయితే నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టానుసారంగా జాక్‌పాట్‌లు నిర్వహిస్తున్నారు. ప్రతి వందక్రేట్లకు 10క్రేట్లు జాక్‌పాట్ వదులుతున్నారు. రైతులు వేలంపాటకు సిద్ధంగా ఉంచిన క్రేట్లపై మరో సారి ఎత్తుగా టమాటాలను వ్యాపారులు పోస్తున్నారు. మళ్లీ వేలం పాటల సమయంలో జాక్‌పాట్ అంటూ వందకు పదిక్రేట్లు తీసుకొంటున్నారు. ఈ లెక్కన వందక్రేట్లకు జాక్‌పాట్ పేరుతో 12క్రేట్లకు పైగా వ్యాపారులు దోచుకొంటున్నారు. మార్కెట్‌కమిటీ పాలకవర్గం ఆదేశాలు ఎక్కడా పాటించడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.


15కిలోల టమాటా క్రేట్ల అమలు ఏది?

వాల్మీకిపురం మార్కెట్‌కమిటీ పరిధిలోని అన్ని మండీల్లో 15కిలోల టమాటా క్రేట్ల విధానం అమలు చేయాలని మార్కెట్ కమిటీ పాలకవర్గం వ్యాపారులను ఆదేశించింది. తమకు కొన్ని రోజుల గడువు కావాలని, తప్పకుండా ఈ విధానాన్ని అమలు చేస్తామని టమాటా వ్యాపారులు అంగీకరించారు. దీంతో రైతులకు జాక్‌పాట్ బెడద తప్పుతుందని పాలకవర్గం భావించింది. అయితే ఇంతవరకు చిన్న టమాటా క్రేట్లను ఏ ఒక్క మండీలోనూ అమలు చేయకపోవడం గమనార్హం. దీంతో రైతులు ఇప్పటికీ పెద్ద క్రేట్ల రూపంలో నష్టపోతున్నారు.

వేలంపాట ధరలో కోతలు

మండీల్లో వేలం పాటలో పాడిన ధరల్లో కూడా ఇప్పటికీ కోతలూ విధిస్తున్నారు. రూ. 1000 క్రేట్ ధర పలుకుతుంటే వేలం పాటలో అవే ధరలు పాడి మళ్లీ రశీదుల్లో లెక్కకట్టే సమయంలో రూ. 50 నుంచి రూ.100 వరకు కోత విధిస్తున్నారు. అందరి ముందర ఒక ధర పాడుకొని బిల్లుల్లో మాత్రం కోత విధిస్తున్నారు. ఓ వైపు జాక్‌పాట్, మరోవైపు 10 శాతం కమీషన్లు, వేలం పాట ధరల్లో కోతలతో రైతులు నష్టపోతున్నారు.

బోర్డులకే పరిమితమైన 4 శాతం కమిషన్


మార్కెట్‌యార్డులో నాలుగుశాతం కమిషన్, జాక్‌పాట్ రద్దు అని నామమాత్రపు బోర్డులు పెట్టిన దృశ్యం

ప్రభుత్వ నిబంధనల మేరకు నాలుగుశాతం కమీషన్ మాత్రమే వసూలు చేయాలి. ప్రతి మండీ వద్ద ఇప్పటికీ 4శాతం మాత్రమే కమీషన్ అనే బోర్డులు ఉన్నాయి. అయితే పేరుకే బోర్డులు వేశారు తప్ప నిబంధనలు అమలు కావడలేదు. పదిశాతం కమీషన్ వసూలు చేస్తున్నారు. మార్కెట్‌యార్డుకు టమాటాలను తీసుకొచ్చే రైతుల దగ్గర 10శాతం కమీషన్‌తో పాటు క్రేట్ కూలీ రూ.2, క్రేట్ బాడుగ రూ.2 వసూలు చేస్తున్నారు. దీంతో ఒక క్రేట్ మార్కెట్‌యార్డుకు చేరేసరికి కోతకూలీ, రవాణా ఖర్చులు, మండీల ఖర్చులు కలుపుకొంటే రు. 24 నుంచి రూ. 30 వరకు ఖర్చు వస్తోంది.

సమయం కావాలంటున్నారు



టమాటా మండీల్లో చిన్న టమాటా క్రేట్లు ఏర్పాటు చేయడానికి వ్యాపారులు కొంత సమయం కావాలంటున్నారు. రెండునెలల క్రితం మార్కెట్‌కమిటీ పాలక వర్గ సమావేశంలో ఈవిషయమై తీర్మానం చేశారు. అప్పుడు వ్యాపారులు అంగీకరించి ఇప్పుడు సమ యం కావాలంటున్నారు. పదిశాతం కమిషన్, జాక్‌పాట్ విధానం ఇంకా కొనసాగిస్తున్నారు.దీనిపై చర్యలు తీసుకొంటాం. – కుమార్‌రెడ్డి, మార్కెట్‌కమిటీకార్యదర్శి, వాల్మీకిపురం

రైతులకు సమాధానం చెప్పాలి



పాలకవర్గం తీసుకొన్న నిర్ణయాలు అమలు చేయాలి. లేని పక్షంలో పాలకవర్గంతో పాటు అధికారులు,వ్యాపారులు రైతులకు సమాధానం చెప్పాలి. ప్రభుత్వ నిబంధనలు మండీల్లో అమలు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. వ్యాపారులు కూడా నిబంధనలకు లోబడే వ్యాపారాలు నిర్వహించాలి. –తరిగొండ నౌషాద్‌అలీ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, వాల్మీకిపురం

సమస్యల పరిష్కారంపై నిబద్ధత అవసరం



మాట్లాడుతున్న జేసీ ఆదర్శ రాజేంద్రన్, చిత్రంలో శ్రీధర్ చామకూరి

రాజంపేట: ప్రజా సమస్యల పరిష్కారంలో రెవెన్యూ అధికారులు నిబద్ధతతో పని చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అన్నారు. మంగళవారం రెవెన్యూ డివిజన్ కేంద్రమైన రాజంపేటలోని బైపాస్‌లో ఉన్న కళాంజలి కల్యాణ మండపంలో రెవెన్యూ పరిపాలన, పారదర్శకత, సమయపాలన, ప్రజా సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధితో పని చేయడంపై రెవెన్యూ శాఖ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీజీఆర్ఎస్ ద్వారా వచ్చిన వినతులను సకాలంలో పరిష్కారించాలన్నారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన భూ వివాదాల దరఖాస్తులు, భూముల రీసర్వే, రికార్డుల అప్డేషన్ తదితర అంశాల్లో రెవెన్యూ సిబ్బంది కీలకపాత్ర పోషించాలన్నారు. ప్రతి అధికారి నిజాయితీ, పారదర్శకతో సేవలందించాలన్నారు. ప్రజలను కార్యాల యాల చుట్టూ తిప్పుకోవద్దన్నారు. నిర్లక్ష్యపు సమాధానం ఇవ్వరాదన్నారు. మెరుగైన సర్వీసులు అందించాలన్నారు. అధికారులు క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించాలన్నారు. శిక్షణ కార్యక్రమాల ద్వారా పని తీరు మెరుగుపరుచుకోవాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ మాట్లాడుతూ ఎగ్జిక్యూటివ్ మెజిస్టీరియల్ పవర్స్, భూమి రికార్డుల శుద్ధి, భూ ఆక్రమణలపై విచారణ సంబంధిత అంశాలపై అవగాహన కల్పించామన్నారు. డీఆర్వో మాట్లాడుతూ ప్రజలతో వ్యవహరించే విధానం తీరుతెన్నుల గురించి వివరించారు. సమావేశంలో రాజంపేట సబ్‌కలెక్టర్ భావన తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది

క్లుప్తంగా

భార్య కాపురానికి రాలేదని ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న సుబ్రమణ్యం

రామసముద్రం : భార్య కాపురానికి రాలేదని భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన రామసముద్రం మండలంలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. రామసముద్రం మండలం చొక్కాడ్లపల్లి పంచాయతీ కనగాని గ్రామానికి చెందిన సుబ్రమణ్యం (45) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో వారం క్రితం భార్యతో గొడవ పడ్డాడు. దీంతో భార్య అలిగి పుట్టింటికి వెళ్లిపోయింది. తిరిగి రాకపోవడంతో మనస్తాపానికి గురైన సుబ్రమణ్యం తన పొలంలో పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు అతన్ని చికిత్స నిమిత్తం మదనపల్లె ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి మదనపల్లెలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతునికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహం కాలేదని..



వంశీకృష్ణారెడ్డి (ఫైల్)

ములకలచెరువు : మనస్తాపంతో పురుగుల మందు తాగి ఒక యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం మండలంలో జరిగింది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు... మండలంలోని చౌడసముద్రం పంచాయతీ చెట్లవారిపల్లెకు చెందిన జి.వంశీకృష్ణారెడ్డి (30)కు వివాహం కాలేదు. డిగ్రీ వరకు చదువుకొని ఇంటి వద్దే ఉంటున్నాడు. వయస్సు వచ్చినా వివాహం కాలేదని, ఉద్యోగం సైతం లేకపోవడంతో మనస్తాపం చెంది ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించి మృత్యువాత పడ్డాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

భార్యతో గొడవ పడి..




రమేష్ మృతదేహం

మదనపల్లె రూరల్ : కుటుంబ సమస్యలతో భార్యతో గొడవపడి భవన నిర్మాణ కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం రాత్రి మదనపల్లె మండలంలో జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు వివరాలు.. కొత్తపల్లె పంచాయతీ కొత్త ఇండ్లుకు చెందిన నరసింహులు కుమారుడు కటారి రమేష్(45) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య ప్రమీల, కుమారుడు క్రాంతి, కుమార్తె అనుష్క ఉన్నారు. ఇటీవల కొంతకాలంగా రమేష్ మద్యానికి బానిసై తరచూ ఇంట్లో భార్యతో గొడవపడేవాడు. ప్రతిసారీ తాను చనిపోతానంటూ బెదిరించేవాడు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి పూటుగా మద్యం తాగి ఇంటికి వెళ్లాడు. ఈ విషయమై భార్యాభర్తల మధ్య మరోసారి గొడవ జరిగింది. అనంతరం మనస్తాపం చెందిన రమేష్ ఇంట్లోని మరో గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. తరచూ బెదిరించడం మామూలే కదా అని కుటుంబ సభ్యులు కొంత సమయం వేచి చూశారు. అయినా తలుపు తీయకపోవడంతో కుమారుడు గదిలోకి తొంగిచూడగా, రమేష్ ఉరికి వేలాడుతూ కనిపించాడు. దీంతో వెంటనే స్థానికుల సహాయంతో తలుపులు తీసి రమేష్‌ను కిందకు దించి హుటాహుటిన ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షిస్తుండగానే, పరిస్థితి విషమించి మృతి చెందాడు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

నాపైనే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తావా..

నీకు బస్సుపాస్ ఇవ్వనుపో!

- రాజంపేట ఆర్టీసీ డిపోలో కౌంటర్ నిర్వాహకుడి బెదిరింపు
- ఆర్టీసీ అధికారులు చెప్పినా పట్టించుకోని వైనం
- సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విద్యార్థి



కలెక్టర్ వాట్సాప్‌కు పంపిన ఫిర్యాదు

రాజంపేట : రాజంపేట డిపోలో బస్సు పాసుల జారీ విషయంలో తనకు జరిగిన అన్యాయాన్ని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరికి వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేసిన ఫలితంగా, ఆర్టీసీ బస్టాండులో బస్‌పాస్ కౌంటర్ నిర్వాహకుడు కిషోర్ ఉద్యానవన కళాశాల విద్యార్థి కె.అభిషేక్‌కు పాసు ఇవ్వకుండా వేధిస్తున్నాడు. బాధిత విద్యార్థి కథనం మేరకు వివరాలిలా.. రైల్వేకోడూరు నియోజకవర్గం అనంతరాజుపేటలో డాక్టర్ వైఎస్సార్ ఉద్యానవన కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న అభిషేక్ సీజన్ పాస్ తీసుకొని రోజు కళాశాలకు వెళ్లి వస్తుంటాడు. బస్ పాస్ రెన్యూవల్ చేసేందుకు వెళ్లిన ఈ విద్యార్థికి కౌంటర్ నిర్వాహకుడి నుంచి చేదు అనుభవం ఎదురైంది. పాసు రెన్యూవల్ చేయకుండా నిరాకరించారు. అంతటితో ఆగకుండా విద్యార్థిని బెదిరించారు. ఈ విషయాన్ని సదరు విద్యార్థి డీఎం రమణయ్య, సీఐ మాధవీలత దృష్టికి తీసుకెళ్లారు. వారు స్పందించారు. నిర్వాహకునితో మాట్లాడారు. మీరెన్నయినా చెప్పండి నేను అభిషేక్‌కు పాస్ ఇవ్వను, ఇస్తే నా విలువ పోతుంది, బస్‌పాస్ కౌంటర్‌కు రాజీనామా చేస్తానని బెదిరింపులకు దిగాడు. దీంతో వారు చేతులెత్తేశారు. తిరిగి ఈ విద్యార్థి జిల్లా కలెక్టర్‌కు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేశాడు. అలాగే సబ్‌కలెక్టర్ భావన దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని వేడుకున్నాడు. గత నెలలో ఈ విద్యార్థి అభిషేక్ బస్సు పాసుల జారీ విషయంలో రూ.40 నుంచి రూ.50 వసూలు చేస్తున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆర్టీసీ అధికారులు స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. అప్పటి నుంచి కిషోర్ విద్యార్థిపై కక్షపెంచుకున్నాడు. సోమవారం పాసు రెన్యూవల్‌కు వెళితే నాపై ఫిర్యాదు చేస్తావా, నీకెంత ధైర్యం, పాసు ఇవ్వను ఎవరికైనా చెప్పుకోపో అంటూ దురుసుగా బెదిరించాడు. గత 30 సంవత్సరాలుగా కిషోర్ ఇక్కడ పాతుకుపోయి డిపో అధికారులను సైతం లెక్క చేయడంలేదని ఇతనిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

డీఎంపై కలెక్టర్ ఫిర్యాదు

రాజంపేట ఆర్టీసీ బస్టాండులో బస్‌పాసు కౌంటర్ నిర్వాహకుడు కిషోర్ వ్యవహారశైలికి అడ్డుకట్టవేయకుండా, హార్టికల్చర్ విద్యార్థి అభిషేక్‌కు పాసు ఇవ్వకుండా నిరాకరించిన వ్యవహారంపై డీఎం రమణయ్యపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నేతి నాగేశ్వర తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో కలెక్టర్‌ను కలిసి బస్‌పాసుల జారీలో నిర్లక్ష్యం, అక్రమ వసూలు తదితర అంశాలపై ఫిర్యాదు చేశారు. బస్ రిజర్వేషన్లు, బస్ పాసులు, ఏఎన్ఎల్ అన్నీ ఒకే వ్యక్తికి ఇవ్వడం వల్లనే ఈ పరిస్థితి అన్నారు. ఇప్పటికైనా విచారణ కమిటీని నియమించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

మోదీన్ సాహెబ్ పల్లెలో విష జ్వరాలు



జ్వరంతో మంచానపడిన వెంకటలక్ష్మి

సిద్దవటం : మండలంలోని మోదీన్ సాహెబ్ పల్లె ఎస్సీ కాలనీలో దాదాపు 10 మందికి విష జ్వరాలు సోకి గత వారం రోజులుగా మంచానికే పరిమితమయ్యారు. గ్రామంలో అధిక వర్షాల కారణంగా అపరిశుభ్రత పేరుకు పోవడంతో దోమలు కుట్టడం వల్ల జ్వరాలు వ్యాపించాయని గ్రామస్తులు తెలిపారు. అంతేకాకుండా జలుబు, దగ్గు, కీళ్ల నొప్పులతో అవస్థలు పడుతున్నారు. గ్రామస్తులు వైద్య సిబ్బందికి ఫిర్యాదు చేయడంతో మంగళవారం మాధవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి జ్వర పీడితులను గుర్తించి మందులను అందజేశారు. గ్రామంలో అపరిశుభ్రత వల్ల, సీజనల్ వ్యాధులు వ్యాపించాయని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు తెలిపారు. కాచి చల్లార్చిన నీరు తాగాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ శ్రావణి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్ద చెరువును చెరబట్టారు



మట్టి తరలింపు దృశ్యం

గాలివీడు : మట్టి మాఫియా బరితెగింపునకు అడ్డు అదుపూ లేకుండా పోతోంది. వాగులు, వంకలు, గుట్టలు ఇలా ఒకటేమిటి కనిపించిన ప్రతి చోటా మట్టిని తరలిస్తూ లక్షలు ఆర్జిస్తున్నారు. అడ్డుకట్ట వేయలేని రెవెన్యూ యంత్రాంగం చేతులెత్తేసింది. తహసీల్దార్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న పెద్ద చెరువులో జేసీబీ యంత్రాలతో విచ్చలవిడిగా ట్రాక్టర్ల ద్వారా మట్టి తరలిస్తుంటే అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు. మంగళవారం ఉదయం దర్జాగా జేసీబీ సాయంతో ట్రాక్టర్లకు మట్టిని నింపి ప్రధాన రహదారులపై తరలిస్తుంటే కనీసం అటువైపు కన్నెత్తి చూసే వారు లేరు. మొన్న పేరాలగుట్ట, నిన్న గుర్రాల మిట్ట నేడు పెద్ద చెరువు ఇలా ఒకటేమిటి కనబడిన చోటల్లా మట్టిని తవ్వి పర్యావరణానికి హాని కలిగిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు నిద్రావస్థలో ఉన్నారంటూ ప్రజలు విమర్శిస్తున్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

మదనపల్లె రూరల్ : దాడి ఘటనపై కేసు నమోదు చేసినట్లు తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. కురబలకోట మండలం తెట్టు పంచాయతీ పూజారివాండ్లపల్లెకు చెందిన శ్రీనివాసులు కుమార్తె పావని(23) ఈనెల 17వ తేదీన తన తల్లి సుమతి జన్మదినం సందర్భంగా తాత మయూర్‌తో కలిసి మదనపల్లె మండలం పొన్నేటిపాలెం పంచాయతీ మోట్లపల్లె వద్ద తమ పొలంలో ఉన్న మామ శరత్‌కుమార్ సమాధి వద్ద పూజలు చేసేందుకు వెళ్లారు. అయితే, పొలంలో వారికి తెలియకుండా వరినారు వేసి ఉండటాన్ని గమనించారు. ఈ విషయాన్ని స్థానికులను విచారించగా, అదే గ్రామానికి చెందిన సురేంద్ర నారు వేసినట్లుగా తెలుసుకుని వెళ్లి అతడిని ప్రశ్నించారు. దీంతో వారి మధ్య వాగ్వాదం జరిగి సురేంద్ర, అతని అన్న శ్రీనివాసులు, తల్లి శివమ్మతో కలిసి పావని కుటుంబ సభ్యులపై దాడికి పాల్పడ్డారు. బాధితురాలు పావని ఫిర్యాదు మేరకు ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు



బైక్ ఢీకొని గాయపడిన గుర్తుతెలియని వ్యక్తి

మదనపల్లె రూరల్ : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన ఘటన మంగళవారం రాత్రి మదనపల్లెలో జరిగింది. నీరుగట్టువారిపల్లె మార్కెట్ యార్డు సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి (40) నడుచుకుంటూ వెళుతుండగా, నీరుగట్టువారిపల్లెకు చెందిన సురేష్ నాయక్ ద్విచక్రవాహనంలో వేగంగా వెళుతూ ఢీకొన్నాడు. ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి తీవ్రంగా గాయపడి అపస్మారకస్థితికి వెళ్లగా, సురేష్‌నాయక్ సైతం గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితులను ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. గుర్తుతెలియని వ్యక్తి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. టూటౌన్ పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

బైక్ ఢీకొని..

బైక్ ఢీకొని మెకానిక్ తీవ్రంగా గాయపడిన ఘటన మంగళవారం మదనపల్లెలో జరిగింది. పట్టణంలోని ఫిషింగ్‌పేటలో నివాసం ఉన్న అయూబ్‌ఖాన్(55) బసినికొండలోని కారు షెడ్‌లో టింకర్‌గా పనిచేస్తున్నాడు. సాయంత్రం షెడ్‌వద్దకు బైక్‌లో వెళుతుండగా, పుంగనూరు రోడ్డులోని మున్సిపల్ బోర్డు సమీపంలో వెనుకనుంచి వచ్చిన మరో ద్విచక్రవాహనం అయూబ్‌ఖాన్‌ను ఢీకొంది. ప్రమాదంలో కుడికాలు విరగ్గా, స్థానికులు బాధితుడిని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు.

రూ.1.80 లక్షలు పలికిన అంగన్వాడీ పోస్టు

సుండుపల్లె : మండల పరిధిలోని చిన్నగొల్లపల్లి గ్రామ పంచాయతీలోని ఒక అంగన్వాడీ పోస్టు రూ.1.80 లక్షలు పలికింది. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని చిన్నగొల్లపల్లి గ్రామ పంచాయతీలో ఇటీవల ప్రభుత్వం ఇచ్చిన అధికారిక ప్రకటనతో అదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. అదే గ్రామానికి చెందిన వెంకటసుబ్బయ్య అనే మాజీ తెలుగు రైతు నేత నుంచి మండలంలోని కొందరు టీడీపీ ముఖ్య నాయకులు అంగన్‌వాడీ పోస్టు ఇప్పిస్తామని లక్ష రూపాయలు వసూలు చేశారు. తర్వాత అదే గ్రామానికి చెందిన మరొకరు రూ.1.80 లక్షలు నగదు ఇవ్వడంతో పోస్టు తమకు లేకుండా మరొకరికి ఇప్పించి మండల టీడీపీ నాయకులు తమకు మోసం చేశారని ఆయన ఆరోపించారు. మండలంలో అంగన్వాడీ పోస్టులను టీడీపీ నాయకులు అమ్ముకుంటున్నారని సొంత పార్టీకి చెందిన నాయకుడే ఆరోపించడం మండలంలో చర్చనీయాంశంగా మారింది.

శ్రీవారి భక్తులపై పోలీసుల దాడి అమానుషం



రామచంద్రారెడ్డి మాజీ ఎమ్మెల్యే

పీలేరు : అక్రమ లిక్కర్ కేసులో అరెస్టు అయిన రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి జైలు నుంచి విడుదల కావాలని కోరుతూ శ్రీవారి భక్తులు గోవిందనామస్మరణతో శ్రీవారి మెట్ల మార్గంలో ప్రశాంతంగా వెళుతున్న తరుణంలో పోలీసులు దాడి చేయడం అమానుషమని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పీలేరు నుంచి తిరుమల శ్రీవారిని దర్శించుకోవడానికి పాదయాత్రగా వెళుతున్న భక్తులపై పోలీసులు బూటు కాళ్లతో తన్నడం, కొట్టడం, ఈడ్చడం ఆటవిక చర్య అని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ నాయకుల ఆదేశాలతోనే పోలీస్ అధికారులు ఇష్టానుసార వ్యవహరించారన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతలపై పోలీసుల తీరు దారుణం



మాట్లాడుతున్న హర్షవర్ధన్ రెడ్డి

మదనపల్లె : శ్రీవారి మెట్ల మార్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల పట్ల పోలీసులు ప్రవర్తించిన తీరు దారుణమని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు హర్షవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎంపీ మిథున్ రెడ్డికి బెయిల్ మంజూరు చేయాలని కాలినడకన శ్రీవారి దర్శనం కోసం వెళ్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రచార కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు హరిప్రసాద్ రెడ్డి, విద్యార్థి సంఘం నాయకుడు చక్రీధర్‌ను చిత్రహింసలకు గురిచేయడం అన్యాయమన్నారు. నియోజకవర్గ స్టూడెంట్ యూత్ అధ్యక్షుడు అశోక్ రాయల్, సోషల్ మీడియా అధ్యక్షుడు సోము, పూర్ణ, పాదం దీపక్, బాలకృష్ణ, కౌశిక్ రెడ్డి, శివ, అనిల్, చరణ్, అష్రఫ్ పాల్గొన్నారు.

దాడి కేసులో నలుగురు టీడీపీ నాయకుల అరెస్టు

మదనపల్లె రూరల్ : తంబళ్లపల్లె నియోజకవర్గంలో నెలకొన్న వర్గపోరులో భాగంగా ఈనెల 15వతేదీ శుక్రవారం శంకర్‌యాదవ్ వర్గంలోని ఇద్దరు వ్యక్తులపై జరిగిన దాడి కేసులో నలుగురు టీడీపీ నాయకులను మంగళవారం అరెస్టు చేశారు. తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపిన మేరకు... ఈనెల 15న తంబళ్లపల్లె నియోజకవర్గం పెద్దమండ్యం మండలం అవికేనాయక్ తండా సర్పంచ్ నటరాజ్ నాయక్(30), ములకలచెరువు మండల నాయునివారిపల్లెకు చెందిన ఐటీడీపీ సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ సాగర్(35)పై మదనపల్లె మండలం చిప్పిలి సమీపంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్రవాహనం, కారులో వెంబడించి కర్రలు, రాడ్లతో దాడిచేశారు. తీవ్రంగా గాయపడిన బాధితులను స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం బాధితులు తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన తాలూకా సీఐ కళావెంకటరమణ విచారణలో భాగంగా నలుగురు టీడీపీ వ్యక్తులు దాడికి పాల్పడినట్లు గుర్తించి మంగళవారం అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో కురబలకోట మండలం గౌడసానిపల్లెకు చెందిన పోలూరు శివశంకర(47), మదనపల్లె పట్టణం చౌడేశ్వరినగర్‌కు చెందిన రెడ్డివారి కార్తీక్‌రెడ్డి(24), కురబలకోట మండలం మట్లవారిపల్లెకు చెందిన రాజోళ్ల హరినాథ్(26), మదనపల్లెకు చెందిన పూసా శ్రీకాంత్‌రెడ్డి(25) ఉన్నారు. నిందితులను కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు.

తొమ్మిది నెలలుగా జీతాలు లేని కాంట్రాక్టు సిబ్బంది



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు, కేజీబీవీ పాఠశాలల కాంట్రాక్టు ఉద్యోగులు

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలోని కేజీబీవీ పాఠశాలల్లో కాంట్రాక్టు పద్ధతిపై పనిచేస్తున్న సిబ్బందికి తొమ్మిది నెలలుగా జీతాలు ఇవ్వనందుకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం జరిగింది. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా మాట్లాడుతూ జీతాలు ఇవ్వాలని అనేక పర్యాయాలు గ్రీవెన్‌సెల్‌లో, సర్వశిక్ష అభియాన్ అధికారులకు విన్నవించుకున్నా ఎవరూ పట్టించుకోకపోవడం దారుణమన్నారు. వేతనాలు అందక కుక్‌లు, అసిస్టెంట్ కుక్‌లు, వాచ్‌మెన్లు, పార్ట్ టైమ్ టీచర్ల కుటుంబాల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం, ఆటంకం కలిగించకుండా విధులు నిర్వహిస్తూ వస్తున్న సిబ్బందికి వేతనాలు చెల్లించే విషయంలో మంత్రి నారా లోకేష్ తక్షణమే జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌కు వినతిపత్రం సమర్పించారు.

శ్రీశైలం ఘాట్‌లో ప్రమాదం

- అదుపుతప్పిన బైకు
- సిద్ధవటం వాసి మృతి

పెద్దదోర్నాల : వేగంగా వస్తున్న ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడటంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని శ్రీశైలం ఘాట్‌లోని చిన్నారుట్ల సమీపంలో మంగళవారం జరిగింది. ప్రమాదంలో వైఎస్సార్ జిల్లా సిద్ధవటానికి చెందిన కొంగ సుబ్బారెడ్డి (44) దుర్మరణం పాలయ్యాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ మహేష్ సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. ఆయన కథనం ప్రకారం.. వైఎస్సార్ జిల్లా సిద్ధవటానికి చెందిన కొంగ సుబ్బారెడ్డి తన బంధువైన మహిళతో కలిసి శ్రీశైలం నుంచి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయల్దేరాడు. ఈ క్రమంలో శ్రీశైలం రహదారిలోని పెద్ద చిన్నారుట్ల సమీపంలోకి రాగానే వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం అదుపుతప్పి పక్కనే ఉన్న కొండను ఢీకొనటంతో ప్రమాదం జరిగింది. తలకు తీవ్ర గాయాలైన సుబ్బారెడ్డి సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. మృతదేహాన్ని మార్కాపురం ఏరియా వైద్యశాలకు తరలిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఫుట్‌బాల్ విజేత వైఎస్సార్ కడప జిల్లా జట్టు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఏపీ సబ్ జూనియర్ బాలికల అంతర్ జిల్లా ఫుట్‌బాల్ టోర్నమెంట్ విజేతగా కడప జిల్లా జట్టు నిలిచింది. ఇటీవల అన్నమయ్య జిల్లాలోని మదనపల్లెలో జరిగిన ఈ టోర్నమెంటులో జిల్లా బాలికలు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచారు. ఫైనల్ మ్యాచ్‌లో అనంతపురంపై 3–0 తేడాతో గెలిచారు. ఈ టోర్నమెంటులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారిణులు రాష్ట్ర జట్టుకు ఎంపికై ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం నారాయణపూర్‌లో జరిగే సబ్ జూనియర్ బాలికల జాతీయ ఫుట్‌బాల్ ఛాంపియన్ షిప్‌లో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించనున్నారు. కాగా రాష్ట్ర జట్టుకు ఎంపికైన వారిలో బి.భార్గవి (గోల్ కీపర్), వై.అశ్విని, ఆర్‌బీ మైథిలి, సాద్విక, నవ్యశ్రీ, వర్షితారెడ్డి ఉన్నారు.

నేటి నుంచి కోర్టులలో పోస్టుల భర్తీకి రాత పరీక్ష

కడప అర్బన్ : జిల్లా వ్యాప్తంగా కోర్టులలో వివిధ విభాగాలలో ఖాళీగా ఉన్న పోస్టులకు రాత పరీక్షలు ఈనెల 20వ తేదీ నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలు కడప నగర శివార్లలోని శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాల, కేఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాల, కేఎల్ఎం ఇంజినీరింగ్ కళాశాల, కేఓఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాల, అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తారన్నారు. అలాగే రాయచోటిలో శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాల, భాస్కర్ ఇంజినీరింగ్ కళాశాలలో, ప్రొద్దుటూరులో శ్రీ రాజేశ్వరి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తారన్నారు. పరీక్షలు ప్రతిరోజు మూడు షిఫ్టులలో ఉంటాయన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్, ఒక గుర్తింపు కార్డును తీసుకొని రావాలన్నారు. పరీక్ష ప్రారంభానికి 15 నిమిషాలు ముందే హాజరు కావాలని, సమయం దాటిన తర్వాత లోనికి అనుమతించరని స్పష్టం చేశారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై చర్చించుకుందాం

రాయచోటి : ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి టీ తాగుతూ చర్చించుకుందాం అనే కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ తెలిపారు. మంగళవారం సాయంత్రం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని ఉద్యోగులకు సీఆర్పీ అరియర్, డీఏ అరియర్, అలాగే మూడు సంవత్సరాల సరెండర్ సెలవులు, అరియర్స్ పెండింగ్ ఉన్నాయన్నారు. రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం అనే కార్యక్రమం ద్వారా ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ బాలాజీ, రాయచోటి తాలూకా అధ్యక్షుడు సాయికుమార్, కార్యదర్శి సుజిత్ దాల్, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు రాజా, సభ్యులు తిరుపతి, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి, గిరిబాబు యాదవ్, మోహన్ నాయక్, శివ భాస్కర్, రెడ్డప్ప రెడ్డి, వైద్య, ఆరోగ్యశాఖ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

'నా భర్త ఆచూకీ తెలపండి'

కడప రూరల్ : తన భర్త భూమిని కౌలుకు తీసుకున్నాడు. పంట చేతికి వచ్చే సమయంలో కనిపించకుండా పోయాడు. న్యాయం చేయాలని బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం వెల్లటూరుకు చెందిన నవ్య శ్రీ తెలిపారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో నాయీ బ్రాహ్మణ జేఏసీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన భర్త నాగేశ్వరరావు, వైయస్సార్ జిల్లా పోరుమామిళ్ల పరిధిలోని పులివీడు గ్రామ పరిధిలో ఖాజాపీర్ అనే వ్యక్తి వద్ద 17 ఎకరాల భూమిని కౌలుకు తీసుకున్నారని పేర్కొన్నారు. తన భర్తతోపాటు బాపట్ల జిల్లాకు చెందిన మరో వ్యక్తికి కూడా భాగస్వామ్యం ఉందన్నారు. మొత్తం రూ 20 లక్షలకు గాను అందులో రూ.7 లక్షలు భూమి యజమానికి ఇవ్వగా, మిగతా డబ్బును జామ పంట కోసం పెట్టుబడిగా పెట్టారన్నారు. పంట చేతికి వచ్చే సమయంలో ఏప్రిల్ 7వ తేదీ నుంచి తన భర్త కనిపించడం లేదన్నారు. ఈ విషయమై తమకు అనుమానాలు ఉన్నాయని, ఆ వివరాలు తెలుపుతూ జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశామన్నారు. వారు పోరుమామిళ్ల పోలీస్ స్టేషన్‌కు రెఫర్ చేశారని తెలిపారు. అయితే ఇప్పటివరకు తన భర్త ఆచూకీ తెలియకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. తమకు ఇద్దరు పిల్లలు ఉన్నారని, అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. నాయీ బ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు నరసింహారావు మాట్లాడుతూ పంట చేతికొచ్చే సమయంలో నాగేశ్వరరావు అదృశ్యం కావడం వెనక బలమైన కారణాలు ఉన్నాయని ఆరోపించారు. తక్షణం పోలీసులు చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎం.శ్రీనివాసులు, వెంకటరమణ, మునిస్వామి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న గ్యాస్ పైపులైన్లు

– శరవేగంగా పునరుద్ధరించిన సంస్థ

కడప కార్పొరేషన్ : కడప నగరంలో అనధికార తవ్వకాల వల్ల రెండు చోట్ల దెబ్బతిన్న గ్యాస్ పైపులైన్లను థింక్ గ్యాస్ సంస్థ శరవేగంగా మరమ్మతులు చేసి పునరుద్ధరించింది. మంగళవారం ఆ సంస్థ ఒక పత్రికా ప్రకటన విడుదల చేసింది. డ్రైనేజీ నిర్మాణ సమయంలో మారుతీనగర్‌లో నాగార్జున స్కూల్ సమీపంలో 20 మి.మీ తక్కువ పీడన పైపులైన్ దెబ్బతిందని, అలాగే వైఎస్సార్ కాలనీ గంగమ్మ ఆలయం సమీపంలో రోడ్డు తవ్వకం వల్ల 32 మి.మీ తక్కువ పీడన సహజ వాయువు పైపులైన్ దెబ్బతినిందన్నారు. ఈ రెండు ఘటనల వల్ల గ్యాస్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందన్నారు. వెంటనే రంగంలోకి దిగిన థింక్ గ్యాస్(గతంలో ఏజీఅండ్‌పీ ప్రథమ్) అత్యవసర ప్రతిస్పందన బృందం ప్రభావిత ప్రాంతాలకు చేరుకొని మరమ్మతులు చేసి, గ్యాస్ సరఫరాను పునరుద్ధరించామన్నారు. తద్వారా ప్రజల భద్రతకు ఎలాంటి ముప్పు వాటిల్లకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. అదే సమయంలో పైపులైన్ దెబ్బతినడానికి కారణమైన వారిపై తగు చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. గ్యాస్ లీకేజీలు, ప్రమాదాలను నివారించడానికి ఏ విధమైన రోడ్డు తవ్వకం పనులకు ముందు అయినా 'డయల్ బిఫోర్ యు డిగ్' – 1800 2022 999 కు కాల్ చేయాల్సిందిగా కోరారు.